సాక్షి
వికారాబాద్



రహదారి పనులు షురూ..
మహబూబ్‌నగర్ – చించోలి జాతీయ రహదారి నిర్మాణం పనులు ప్రారంభమయ్యాయి.
8లో▸



దామగుండం దర్శిద్దాం రండి
జిల్లాలో ప్రసిద్ధిగాంచిన దామగుండ రామలింగేశ్వర స్వామి ఉత్సవాలు గురువారం నుంచి ప్రారంభమవుతాయి.
8లో▸

18న ఇంటర్వ్యూలు
కొడంగల్ రూరల్: మైనార్టీ కార్పొరేషన్ రుణాల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న ముస్లిం మైనార్టీ అభ్యర్థులు ఈనెల 18న మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించే ఇంటర్వ్యూలకు హాజరు కావాలని మున్సిపల్ కమిషనర్ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. చిరు వ్యాపారాల కోసం కేటగిరీ– 1, కేటగిరీ– 2 కింద దరఖాస్తు పెట్టుకున్న వారు.. ఆన్‌లైన్ అప్లికేషన్, రేషన్‌కార్డు, ఆధార్‌కార్డు, బ్యాంకు ఖాతా పాస్‌బుక్, ఆదాయ ఒరిజినల్ సర్టిఫికెట్లతో రావాలన్నారు.

గురువారం । 16 । మార్చి । 2023

న్యూస్‌రీల్

వాహన పన్ను చెల్లించాలి



ధారూరులో వాహనాలకు జరిమానాలు విధిస్తున్న ఆర్టీఓ జోసెఫ్

ధారూరు: వాహనదారులు విధిగా రోడ్ టాక్సులు చెల్లించాలని ఆర్టీఓ జోసెఫ్ సూచించారు. ధారూరులోని తాండూరు– హైదరాబాద్ ప్రధాన రోడ్డుపై బుధవారం వాహనాల తనిఖీ నిర్వహించారు. నిబంధనలకు విరుద్ధంగా తిరుగుతున్న పలు వెహికిల్స్‌కు జరిమానా విధించారు. కోట్‌పల్లి మండల కేంద్రంలోని విజేత ఉన్నత పాఠశాల బస్సుకు 2019 నుంచి టాక్స్ చెల్లించలేదని, దీంతో రూ.6.50 లక్షల పెనాల్టీ వేశామని స్పష్టంచేశారు.

న్యూట్రిషన్ కిట్ల పంపిణీ



కుల్కచర్ల ఆస్పత్రిలో న్యూట్రిషన్ కిట్లు అందజేస్తున్న వైద్యాధికారులు

కుల్కచర్ల: గర్భిణులు, బాలింతలు ప్రభుత్వం అందజేస్తున్న పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని మండల వైద్యాధికారి మాధురి అన్నారు. కుల్కచర్లలోని ప్రభుత్వ ఆస్పత్రిలో బుధవారం 39 మంది గర్భిణులకు న్యూట్రిషన్ కిట్లు పంపిణీ చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. పుట్టబోయే బిడ్డ ఆరోగ్యం ఉండాలంటే బలవర్ధకమైన ఆహారం తీసుకోవాలని సూచించారు. లేదంటే రక్తహీనతకు గురవడంతో పాటు ప్రసవం సమయంలో ఇబ్బందులు తలెత్తే ప్రమాదం ఉంటుందన్నారు. సీహెచ్‌ఓ చంద్రప్రకాశ్, వైద్య సిబ్బంది విజయలక్ష్మి, యాదమ్మ, సుజాత, ఫాతిమా, మల్లేశ్, నవీన్, ప్రశాంత్, సిరాజ్, శ్రీనివాస్, ఆశ కార్యకర్తలు స్వరూప, యాదమ్మ, ఊర్మిళ, పుష్పమ్మ, లింగమ్మ తదితరులు పాల్గొన్నారు.

నీట్ పీజీ ఎంట్రెన్స్‌లో సత్తాచాటిన డాక్టర్ ప్రజ్ఞ



నీట్ పీజీ ఎంట్రెన్స్‌లో ర్యాంగు సాధించిన ప్రజ్ఞా

పరిగి: పట్టణ కేంద్రానికి చెందిన డాక్టర్ ఫిరంగి ప్రజ్ఞ నీట్ పీజీ ఎంట్రెన్స్ పరీక్షలో ఆల్‌ఇండియా 527 ర్యాంకు సాధించింది. కరీంనగర్‌లోని ఆనంద్‌రావు మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ చదువుతోంది. ఈనెల 5న నీట్ పీజీ ఎంట్రెన్స్ పరీక్ష రాయగా బుధవారం ఫలితాలు వెలువడ్డాయి. ఆల్‌ఇండియాలో 527 ర్యాంకు రావడం పట్ల విద్యార్థిని కుటుంబ సభ్యులు, పట్టణ వాసులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

పోలీసు శిక్షణ కేంద్రం పరిశీలన



డీటీసీని పరిశీలిస్తున్న ఐజీ కాశీం

అనంతగిరి: పోలీసు శిక్షణ కేంద్రాన్ని సిద్ధం చేయాలని మల్టీ జోన్ ఐజీ షానవాజ్ కాశీం అన్నారు. ఈమేరకు బుధవారం ఆయన వికారాబాద్‌లోని ట్రైనింగ్ సెంటర్‌ను పరిశీలించారు. అనంతరం డీటీసీలోని పరేడ్ గ్రౌండ్, బ్యారెక్‌లు, తాగునీటి వసతులు, మరుగుదొడ్లు, స్నానపు గదులు, తరగతి, వంట గదులను పరిశీలించారు. పోలీసు శిక్షణ కోసం రానున్న సిబ్బందికి అన్ని వసతులు కల్పించాలని ఆదేశించారు. ఇందుకోసం అవసరమైన మరమ్మతులు చేపట్టాలన్నారు. శిక్షణ కేంద్రంలో స్వచ్ఛమైన గాలి, ఆహ్లాదకరమైన వాతావరణం ఉందని కితాబిచ్చారు. డీటీసీని పరిశుభ్రంగా ఉంచుకుని మరిన్ని మొక్కలు నాటాలని సూచించారు. అంతకుముందు పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. డీటీసీ ఏఎస్పీ మురళీధర్, డీఎస్పీలు విజయ్, సత్యనారాయణ, సీఐలు శ్రీనివాసరావు, తిరుపతిరాజు, శీను, అప్పయ్య, మల్లేశం, ఆర్‌ఐలు రత్నం, సూరప్పనాయుడు తదితరులు పాల్గొన్నారు.

‘వెలుగు’ వేగం

- యుద్ధ ప్రాతిపదికన కంటి వెలుగు పరీక్షలు
- ఇప్పటి వరకు 2లక్షల మందికి స్క్రీనింగ్ టెస్టులు
- 44వేల మందికి కళ్లద్దాల పంపిణీ
- జిల్లావ్యాప్తంగా పనిచేస్తున్న 42 బృందాలు



వికారాబాద్: జిల్లాలో కంటి వెలుగు కార్యక్రమం జోరందుకుంది. వంద పని దినాల్లో టాస్క్ పూర్తి చేయాల్సి ఉండగా.. 46 రోజుల్లోనే 50శాతం లక్ష్యం పూర్తయింది. అద్దాలు పంపిణీ చేసే విషయంలో మిగతా జిల్లాలో పోలిస్తే మనం ముందు వరుసలో ఉన్నట్లు వైద్యారోగ్య శాఖ గణాంకాలు చెబుతున్నాయి. ఓవరాల్‌గా చూస్తే కలెక్టర్, డీఎంఅండ్‌హెచ్‌ఓ పర్యవేక్షణలో కంటివెలుగు వేగంగా దూసుకుపోతోంది. ఇదే ఒరవడి కొనసాగితే గడువు లోపే టార్గెట్ పూర్తయ్యే అవకాశం ఉంది. కళ్ల ప్రాధాన్యతను గుర్తించి ప్రభుత్వం చేపట్టిన ‘కంటి వెలుగు’కు ప్రజల నుంచి మంచి స్పందన లభిస్తోందని వైద్యాధికారులు చెబుతున్నారు. 18 ఏళ్లు పైబడిన వారందరూ శిబిరాలకు వచ్చి పరీక్షలు చేయించుకుంటున్నారు. సంబంధిత అధికారులు, సిబ్బంది ఓ పక్క స్క్రీనింగ్ టెస్టులు చేస్తూనే మరో పక్క అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

యుద్ధ ప్రాతిపదికన

జిల్లాలో 9.27లక్షల జనాభా నివసిస్తోంది. వీరందరికీ నేత్ర పరీక్షలు చేసేందుకు ప్రభుత్వం 42 వైద్య బృందాలను ఏర్పాటు చేసింది. ఒక్కో టీంలో ఎనిమిది మంది విధులు నిర్వర్తిస్తున్నారు. ఉదయం ,మధ్యాహ్నం, సాయంత్రం వేళల్లో దశలవారీగా శిబిరాలు ఏర్పాటు చేసి, యుద్ధ ప్రాతిపదికన ముందుకు సాగుతున్నారు. ఇందుకోసం మండలాల్లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వారీగా, పట్టణాల్లోని వార్డుల వారీగా వైద్య సిబ్బందిని నియమించారు. సేవలపై మీడియా, సోషల్ మీడియాలో విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. ఆశ వర్కర్లకు ముందస్తుగా అందజేసిన సర్వే పత్రాల ద్వారా ఆయా కుటుంబాల్లో ఎవరికైనా డయాబెటీస్ (షుగర్), బీపీ, చక్కెర, క్యాన్సర్, ఇతరత్రా స్వల్ప, దీర్ఘకాలిక వ్యాధులేమైనా ఉన్నాయా..? అనే వివరాలు సేకరించారు. ఇంట్లో ఎవరికైనా ఇప్పటికే కంటి సమస్యలు ఉన్నాయా.. కళ్ల అద్దాలు వాడుతున్నారా.. కంటి ఆపరేషన్లు చేయించుకున్నారా..? అనే పూర్తి సమాచారాన్ని నమోదు చేసుకున్నారు. కంటి వెలుగు కార్యక్రమం సందర్భంగా సర్వే వివరాల ఫీడ్ బ్యాక్‌ను పరిశీలిస్తూ పరీక్షలు చేస్తున్నారు.

నిత్యం 150 మందికి టెస్టులు

ఒక్కో బృందంలో నిత్యం సగటున 150 నుంచి 170 మందికి స్క్రీనింగ్ నిర్వహిస్తున్నారు. ప్రతీ టీంలో వైద్యాధికారితో పాటు నేత్ర వైద్యుడు, సిబ్బంది విధులు నిర్వర్తిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా 4.5 లక్షల మంది కంటి వెలుగును సద్వినియోగం చేసుకునే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. ఇప్పటి వరకు సుమారు రెండు లక్షల మందికి పరీక్షలు నిర్వహించారు. వీరిలో 44 వేల మందికి కళ్లద్దాలు పంపిణీ చేశారు. మరో 10 వేల మందికి అద్దాలు పంపిణీ చేయాల్సి ఉంది. రీడింగ్ గ్లాసులు అవసరమైన వారికి అక్కడికక్కడే అందజేస్తున్నారు.

సద్వినియోగం చేసుకోవాలి



ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో కంటి వెలుగు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాం. నిపుణులైన వైద్యులతో పరీక్షలు చేయిస్తున్నాం. ప్రజలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.
– పాల్వన్‌కుమార్, డీఎంహెచ్‌ఓ



ధారూరు: కుడి కాల్వ తూమును పరిశీలిస్తున్న కలెక్టర్ నారాయణరెడ్డి

చివరి పొలాలకు నీరందాలి

- కోట్‌పల్లి కాల్వలు బాగు చేయండి
- కలెక్టర్ నారాయణరెడ్డి ఆదేశం
- అధికారులతో కలిసి ప్రాజెక్టు పరిశీలన

ధారూరు: కోట్‌పల్లి ప్రాజెక్టు ఆధునీకరణకు నిధులు వచ్చే వరకు రైతులు, ప్రజల భాగస్వామ్యంతో పనులు చేయించాలని కలెక్టర్ నారాయణరెడ్డి సూచించారు. ఇరిగేషన్, రెవెన్యూ, అటవీ, మండల పరిషత్ అధికారులతో కలిసి బుధవారం ఆయన ప్రాజెక్టు కుడి, ఎడమ కాల్వలు, తూములు, బేజీ కెనాల్‌ను పరిశీలించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రస్తుతం ఇరిగేషన్ శాఖ తరఫున కాల్వల్లో మట్టితీసే పనులు, జంగిల్ కటింగ్ పనులు కొనసాగుతున్నాయని, ప్రధాన కాల్వ నుంచి పొలాలకు వెళ్లే పిల్ల కాల్వలు సరిగా లేకపోవడంతో సగం నీరు వృథా అవుతోందని రైతులు ఆవేదన వ్యక్తంచేశారు. దీనిపై స్పందించిన కలెక్టర్ ఉపాధి హామీ కూలీలతో పూడికతీత, పిచ్చి మొక్కల తొలగింపు పనులు చేపట్టి, చివరి ఆయకట్టుకు నీరందేలా చూడాలని ధారూరు, పెద్దేముల్ ఎంపీడీఓలు, ఏపీఓలు చంద్రశేఖర్, లక్ష్మయ్య, సురేష్, లక్ష్మీదేవికి ఆదేశించారు. ప్రాజెక్టుకు 9,200 ఎకరాల ఆయకట్టు భూములున్నా.. 4,500 ఎకరాలకే నీరందుతోందని, వచ్చే జూన్ వరకు మొత్తం ఆయకట్టుకు నీరందించాలని సూచించారు. ఏప్రిల్, మే నెల్లో ఉపాధి కూలీల ద్వారా పిల్ల కాల్వల్లో పనులు చేయించాలన్నారు. కనీసం 8వేల ఎకరాలకు నీరందించలేకపోతే మీ సేవలు పెద్దేముల్ మండలానికి అవసరం లేదన్నారు. ఇందుకోసం ఒక్కో ఉపాధి కూలికి రూ.150 బదులు రూ.250 చెల్లించాలని సూచించారు. మిషన్ల ద్వారా పనులు చేయించే అవకాశం లేదన్నారు. నిర్దేశించిన సమయంలోపు ప్రాజెక్టుకు అవసరమైన పనులు పూర్తిచేయాలని ఆదేశించారు. తమ పొలాలకు వెళ్లేందుకు సరైన రోడ్డు లేదని ఆయకట్టు రైతులు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లగా.. సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

బోటింగ్ సిబ్బంది ఫిర్యాదు

ప్రాజెక్టులో బోటింగ్ చేయించడానికి తమకు అనుమతులున్నా ఫారెస్టు అధికారులు ప్రాజెక్టుకు వచ్చే దారిని మూసివేయించారని, ఫలితంగా తాము ఉపాధిని కోల్పోయామని కాయకింగ్ బోటింగ్ సిబ్బంది కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ విషయమై కలెక్టర్ మాట్లాడుతూ.. సంబంధిత అధికారులతో చర్చించి పరిష్కార మార్గం చూపుతామని తెలిపారు.

మానవతా దృక్పథంతో పనిచేయండి..

వికారాబాద్ అర్బన్: మానవతా దృక్పథంతో పనిచేసి రైతులకు పట్టాదారు పాసు పుస్తకాలు, రైతు బంధు డబ్బులు అందేలా చూడాలని తెలిపారు. బుధవారం ఆర్డీఓలు, తహసీల్దార్లతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. అర్హులైన రైతులను గుర్తించి వారికి సంబంధించిన సమస్యలను పరిష్కరించేందుకు మనసు పెట్టి పనిచేసి వారికి న్యాయం చేయాలని సూచించారు. అనంతరం సంఘం లక్ష్మీబాయి ఇంటర్ ఎగ్జామ్ సెంటర్‌ను తనిఖీ చేశారు. పరీక్ష కేంద్రాల్లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలపై ఆరా తీశారు. కలెక్టర్ వెంట ఇంటర్ నోడల్ అధికారి శంకర్‌నాయక్, ప్రిన్సిపాల్ రమణమ్మ ఉన్నారు.

మిత్తి లేకుండా.. అప్పు కావాలా!



స్వామిజీతో మాట్లాడుతున్న ఎస్‌ఐ గిరి

- రూ.20 వేలు డిపాజిట్ చేస్తే రూ.లక్ష రుణం
- వడ్డీ, పూచీకత్తు అవసరం లేదు
- ఎగబడి ధరావత్తు చేసిన జనం
- ఓ స్వామిజీ ఘరానా మోసం

కుల్కచర్ల: అప్పు కావాలా? అయితే.. ముందుగా ఎంత డిపాజిట్ చేస్తే అందుకు ఐదు రెట్లు రుణం ఇస్తా. వడ్డీ, పూచీకత్తు అవసరం లేదు. ఇంకేం.. జనం ఎగబడ్డారు. లక్షల రూపాయల డిపాజిట్లు చేశారు. చివరకు ఇదంతా మోసం అని తెలియడంతో లబోదిబోమంటూ పోలీసులను ఆశ్రయించారు. తనకు తాను స్వామీజీగా పరిచయం చేసుకొని జనాన్ని నట్టేట ముంచిన ఓ ఘరానా మోసగాడి ఉదంతమిది. ఈ సంఘటన కుల్కచర్లలో బుధవారం వెలుగుచూసింది. పోలీసుల కథనం ప్రకారం..రంగారెడ్డి జిల్లా చౌదరిగూడెం మండలం పద్మారం గ్రామానికి చెందిన హరికృష్ణ రెండేళ్ల క్రితం ఇంటి నుంచి వెళ్లిపోయి.. మూడు నెలల క్రితం స్వామిజీగా ప్రత్యక్షమయ్యాడు. కుల్కచర్ల మండలం చాపలగూడెంలోని ఒక ఇంట్లో ఆశ్రమం ఏర్పాటు చేసుకున్నాడు. తనకు శివుడు కలలో ప్రత్యక్షమయ్యాడని, పేద ప్రజలకు సేవ చేయాలని ఆజ్ఞాపించడంతో చాపలగూడేనికి వచ్చానని ప్రచారం చేసుకుంటున్నాడు. ఆలయంలో పూజలు నిర్వహించడం, తాయత్తులు మంత్రించి ఇవ్వడం వంటి కార్యక్రమాలు నిర్వహించాడు. దీంతో భక్తుల తాకిడి పెరిగింది. ఇటీవల ఆర్థిక పరమైన అంశాలపై దృష్టిసారించాడు. అవసరమైన వారికి రుణం ఇస్తానని తన దగ్గరకు వచ్చే భక్తులకు చెప్పేవాడు. రూ.20 వేలు డిపాజిట్ చేస్తే రూ.లక్ష ఇస్తానని నమ్మబలికాడు. వడ్డీ, పూచికత్తు లాంటి కండీషన్లు ఏమీ ఉండవన్నాడు. ఇలా.. 66 మంది నుంచి రూ.24.56 లక్షలు సేకరించాడు. వారిలో 19 మందికి 11.75 లక్షలు అప్పుగా చెల్లించాడు. ఇదేదో బాగుందని జనం డిపాజిట్లు చేశారు. అయితే.. ఇటీవల రుణాలు ఇవ్వడంలో జాప్యం జరుగుతుండటంతో అనుమానం వచ్చిన బాధితులు పోలీసులను ఆశ్రయించారు. తమకు డబ్బులను ఇప్పించాలని ప్రాధేయపడ్డారు. నిందితుడిని అదుపులోకి తీసుకున్న పోలీసులు విచారణ చేపట్టారు. కాగా, చట్ట వ్యతిరేకంగా ప్రజల నుంచి డబ్బులు సేకరించిన వ్యక్తిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నామని ఎస్‌ఐ గిరి తెలిపారు. వివరాలు సేకరిస్తున్నామని, అన్ని ఆధారాలు సేకరించాక చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టంచేశారు.

గురుకులంలో అడ్మిషన్లకు దరఖాస్తు చేసుకోండి

తాండూరు టౌన్: పట్టణంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో (పెద్దేముల్) ఐదో తరగతి అడ్మిషన్ల కోసం దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ సుజాత బుధవారం ఓ ప్రకటనలో కోరారు. ప్రస్తుతం నాలుగో తరగతి చదువుతున్న విద్యార్థులు గురువారం సాయంత్రం 4గంటల లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

సకాలంలో వైద్య సేవలు అందించాలి

తుక్కుగూడ: అసంక్రమిత వ్యాధుల బారిన పడిన గ్రామీణ, పట్టణ ప్రాంతాల ప్రజలకు సకాలంలో వైద్య సేవలు అందించాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ వెంకటేశ్వర్‌రావు అన్నారు. బుధవారం వైద్య సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ముఖ్యంగా అధిక రక్తపోటు (బీపీ), మధుమేహం (షుగర్) వ్యాధిగ్రస్తులను గుర్తించి శాస్త్రీయమైన చికిత్సను అందించాలన్నారు. ప్రభుత్వం ఉచితంగా పంపిణీ చేస్తున్న ఎన్‌సీడీ కిట్లను ఉచితంగా అందజేయాలన్నారు. వీరితో పాటు క్షయ (టీబీ) వ్యాధి నిర్మూలనపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వెల్డన్ ముఖేశ్

మంత్రి కేటీఆర్ అభినందన

బషీరాబాద్: అమెరికాలోని ప్రపంచ బిగ్గెస్ట్ రియాల్టీ షో ఏజీటీకి వికారాబాద్ జిల్లా బషీరాబాద్ మండలం మైల్వార్ గ్రామ యువకుడు ఎంపిక అయ్యాడు. గ్రామానికి చెందిన జోగు బుడ్డప్ప కుటుంబంతో కలిసి హైదరాబాద్‌లో జీవనం సాగిస్తున్నాడు. అతడి కొడుకు ముఖేశ్ స్టంట్స్ మాస్టర్. తన ప్రత్యేక టీంతో కొంతకాలంగా అనేక సాహసోపేతమైన స్టంట్స్ నిర్వహించాడు. ఇతని ప్రతిభను గుర్తించిన ‘అమెరికా గాట్ టాలెంట్’ (ఏజీటీ) నిర్వాహకులు టీవీ షోకు ఎంపిక చేశారు. దక్షిణ భారతదేశం నుంచి ఈ షోకు ఎంపికైన మొదటి వ్యక్తి ముఖేశ్ అని కుటుంబ సభ్యులు తెలిపారు.

మంత్రి కేటీఆర్ అభినందన..

తాండూరు ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి స్టంట్ మాస్టర్ ముఖేశ్‌ను బుధవారం హైదరాబాద్‌లో మంత్రి కేటీఆర్ వద్దకు తీసుకెళ్లారు. తాండూరు ప్రాంతానికి చెందిన యువకుడు ఏజీటీ షోకు ఎంపికైనట్లు వివరించారు. కేటీఆర్ యువకుడిని అభినందించి ఆల్‌ది బెస్ట్ చెప్పారు. ముఖేశ్‌కు అన్ని విధాలా తోడుంటామని ఎమ్మెల్యే తెలిపారు.



ముఖేశ్‌ను అభినందిస్తున్న మంత్రి కేటీఆర్ చిత్రంలో ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి

ఎమ్మెల్సీ ఓట్ల లెక్కింపు నేడు

- సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో ఏర్పాట్లు
- ఉదయం 8 గంటల నుంచి కౌంటింగ్

సాక్షి, రంగారెడ్డి జిల్లా: ఉమ్మడి మహబూబ్‌నగర్, రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాల ఉపాధ్యాయ శాసనమండలి ఎన్నికల ఓట్ల లెక్కింపు గురువారం ఉదయం 8 గంటలకు సరూర్‌నగర్ స్టేడియంలో మొదలు కానుంది. మూడు జిల్లాల నుంచి మొత్తం 21 మంది అభ్యర్థులు పోటీ చేశారు. నియోజకవర్గంలో మొత్తం 29,720 మంది ఓటర్లలో 26,866 మంది ఓటేశారు. ఓట్ల లెక్కింపు కోసం మొత్తం 28 టేబుళ్లను సిద్ధం చేశారు. ఒక్కో టేబుల్‌కు ఒక్కో అధికారితో పాటు నలుగురు కౌంటింగ్ సిబ్బందిని నియమించారు. ఓట్ల కౌంటింగ్ సమయంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. అధికారులు, పోలింగ్ ఏజెంట్లు, అభ్యర్థులు మినహా ఇతరులెవరినీ లోనికి అనుమతించరు.

ఒక్కో టేబుల్‌కి వెయ్యి ఓట్లు

ఓట్ల గణనలో భాగంగా తొలుత 137 బూత్‌ల నుంచి వచ్చిన బ్యాలెట్ బాక్సులను ఒకచోటకు చేర్చి ప్రతి 50 బ్యాలెట్ పేపర్లను ఒక బండిల్‌గా జత కడతారు. ఆ తర్వాత ఓట్ల లెక్కింపునకు ఒక్కో టేబుల్‌కి వెయ్యి ఓట్లు ఇస్తారు. పోలైన మొత్తం ఓట్లలో మొదటి ప్రాధాన్యత ఓట్లు 50 శాతానికిపైగా మెజారిటీ సాధించిన వారిని విజేతగా ప్రకటించనున్నారు. ఒకవేళ మొదటి ప్రాధాన్యత ఓట్లు యాభైశాతం రాకపోతే.. ఆ తర్వాత రెండు, మూడు, నాలుగు, ఐదు.. ఇలా చివరి ప్రాధాన్యత ఓటు వరకు లెక్కించి, అతి తక్కువ ఓట్లు సాధించిన వారిని ఎలిమినేట్ చేసుకుంటూ వచ్చి, చివరికి రెండో ప్రాధాన్యత ఓట్లు ఎక్కువ సాధించిన వారిని విజేతగా ప్రకటిస్తారు. మొదటి ప్రాధాన్యత ఓట్ల లెక్కింపు ఫలితం మధ్యాహ్నం మూడు గంటల వరకు వెల్లడయ్యే అవకాశం ఉంది.

తాగుబోతు సారు మాకొద్దు!

ఇదేంటీ డ్రంకన్ డ్రైవ్ పరీక్షలు రోడ్ల పక్కన నిర్వహించాలి కానీ.. తరగతి గదిలో ఏమిటని ఆశ్చర్యపోతున్నారా..? అనుమానం అక్కర్లేదు.. మీరు చూస్తున్నది వాస్తవమే. సర్కారు బడిలో ఉద్యోగం వెలగబెడుతున్న ఓ డ్రింక్ ‘మాస్టర్’.. నిత్యం మందేసి స్కూల్‌కు వస్తున్నాడు. మత్తులో తూగుతూ విద్యార్థులను చిత్తుగా కొడుతున్నాడు. ఈ విషయమై తల్లిదండ్రులు ఆందోళన చేపట్టడంతో.. పోలీసులు వచ్చి నోట్లో పైపు పెట్టి ఊదించారు.. నసీబ్ బాగుండి సారు రెడ్ హ్యాండెడ్‌గా దొరకలేదు.



ఆందోళన చేస్తున్న గ్రామస్తులతో మాట్లాడుతున్న మండల విద్యాధికారి హరిశ్చందర్

- మద్యం మత్తులో చితక బాదుతున్నాడు
- బ్రీత్ అనలైజర్ టెస్ట్ చేసిన పోలీసులు
- సయ్యద్‌పల్లి పాఠశాల ఎదుట ఆందోళన

పరిగి: మద్యం మత్తులో ఉన్న ఉపాధ్యాయుడు తమ పిల్లలను చితకబాదాడంటూ విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళనకు దిగారు. పరిగి మండల పరిధిలోని సయ్యద్‌పల్లిలో బుధవారం ఈ ఘటన చోటు చేసుకుంది. స్థానిక ప్రాథమికోన్నత పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుడు రాజేందర్ 5వ తరగతి చదువుతున్న ఆరుగురు విద్యార్థులను మంగళవారం చితకబాదాడు. యశ్వంత్, మల్లీశ్వరికి గాయాలు కాగా మరో నలుగురు సైతం స్వల్పంగా గాయపడ్డారు. సాయంత్రం ఇంటికి వెళ్లిన విద్యార్థుల చేతులపై కొట్టిన గాయాలను చూసిన తల్లిదండ్రులు ప్రశ్నించడంతో.. రాజేందర్ సార్ తాగొచ్చి కొడుతున్నాడని చెప్పారు. ఈ విషయంపై బుధవారం స్కూల్‌కు చేరుకున్న తల్లిదండ్రులు, గ్రామస్తులు ఆందోళన చేపట్టారు. ‘తాగుబోతు సారు మాకొద్దు’ అంటూ నినాదాలు చేశారు. మద్యం తాగి వచ్చి విధులు నిర్వహిస్తున్న ప్రభుత్వ ఉపాధ్యాయుడిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ విషయం తెలుసుకున్న మండల విద్యాధికారి హరిశ్చందర్ పాఠశాలకు చేరుకుని వివరాలు తెలుసుకున్నారు. సదరు టీచర్ ఈ రోజు కూడా తాగొచ్చాడని తల్లిదండ్రులు ఆరోపించడంతో పోలీసులకు సమాచారం అందించి, బ్రీత్ అనలైజర్ టెస్ట్ చేయించారు. అయితే ఉపాధ్యాయుడు తాగలేదని రావడంతో కొంత శాంతించారు. తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఉన్నతాధికారులకు నివేదిక అందజేస్తామని ఎంఈఓ తెలిపారు.



ఉపాధ్యాయుడికి బ్రీత్ అనలైజర్‌తో పరీక్ష చేస్తున్న పోలీసులు

క్లుప్తంగా

రేపు లబ్ధిదారుల ఎంపిక

అనంతగిరి: మైనార్టీ కార్పొరేషన్ రుణాల కోసం లబ్ధిదారుల ఎంపిక శుక్రవారం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ సత్తయ్య ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మండలానికి మొత్తం 14 యూనిట్లు కేటాయించారన్నారు. మధ్యాహ్నం 2 గంటలకు ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో జరిగే ఎంపికకు లబ్ధిదారులు ఆధార్‌కార్డు, బ్యాంక్ అకౌంట్ పాసు పుస్తకం, ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న ఫారం, కులం సర్టిఫికేట్ వెంట తీసుకుని రావాలన్నారు.

ఇద్దరికి రిమాండ్

కుల్కచర్ల: ఆత్మహత్యకు కారకులైన వ్యక్తులపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించిన ఘటన మండల పరిధిలో చోటుచేసుకుంది. ముజాహిద్‌పూర్‌కు చెందిన క్షీరసాగర విజయ్ కుమార్ గత నెల 15న ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి తల్లి తారాబాయి తన కుమారుడి మరణంపై అనుమానం ఉందని పోలీసులకు ఫిర్యాదు చేసింది. విచారించిన పోలీసులు విజయ్‌కుమార్ ఆత్మహత్యకు గుండమ్మ, లక్ష్మీనారాయణ కారకులని నిర్ధారించారు. బుధవారం వారిని పరిగి జైలుకు తరలించినట్లు ఎస్ఐ గిరి తెలిపారు.

గ్రామకంఠం భూమి కబ్జాపై ఫిర్యాదు

దౌల్తాబాద్: మండలంలోని బిచ్చాల గ్రామంలో ఓ వ్యక్తి గ్రామకంఠం భూమిని కబ్జా చేసి ఇల్లు నిర్మించేందుకు యత్నిస్తున్నారంటూ కొందరు గ్రామస్తులు బుధవారం పంచాయతీకార్యదర్శి, ఎస్ఐ, ఎంపీఓకు ఫిర్యాదు చేశారు. గ్రామంలోని గ్రామకంఠం భూమిని గతంలో అంగన్‌వాడీ భవన నిర్మాణానికిగాను పంచాయతీ తీర్మానం చేసి ఇచ్చారు. అయితే ఇప్పుడు సర్పంచ్ కుటుంబసభ్యుల్లో ఒకరు అదే భూమిని మంగళవారం రాత్రి జేసీబీతో చదునుచేయించి ఇల్లు నిర్మించేందుకు యత్నిస్తున్నారు. దీనిపై అధికారులకు ఫిర్యాదు చేశారు. సదరు వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని వారు కోరారు. ఫిర్యాదు చేసిన వారిలో భగవంతు, వెంకట్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, కాశప్ప తదితరులున్నారు.

'రాజ్యాధికారమే లక్ష్యం కావాలి'

బొంరాస్‌పేట: బహుజనులకు రాజ్యాధికార బాటలు వేసింది కాన్షీరాం అని దళిత శక్తి ప్రోగ్రాం (డీఎస్‌పీ) జిల్లా కో కన్వీనర్ వెంకట్రాములు అన్నారు. దుద్యాల మండలం చిల్మల్ మైలారంలో బుధవారం కాన్షీరాం జయంతిని ఘనంగా నిర్వహించారు. కాన్షీరాం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రాజ్యాధికారమే లక్ష్యంగా బహుజనులందరూ ఏకం కావాలని అన్నారు. దళిత శక్తి ప్రోగ్రాం వ్యవస్థాపకుడు డాక్టర్ విశారదన్ మహరాజ్ చేపట్టిన 10వేల కిలో మీటర్ల స్వరాజ్య పాదయాత్ర మొదలై నేటికీ ఏడాది పూర్తయినట్లు వెంకట్రాములు తెలిపారు. పాదయాత్ర విజయోత్సవం సందర్భంగా నిర్వహిస్తున్న సభకు వెంకట్రాములుతోపాటు నాయకులు తదితరులు తరలివెళ్లారు.

ఆత్మరక్షణకు కరాటే తప్పనిసరి

పూడూరు: ఆత్మరక్షణ కోసం కరాటే తప్పనిసరి అని స్పోర్ట్స్ కరాటే అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు చెన్నయ్య అన్నారు. బుధవారం మండల పరిధిలోని సోమన్‌గుర్తి జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థినులకు కరాటే పోటీలు నిర్వహిచారు. ఇందులో ప్రతిభ కనబరిచిన వారికి బెల్టులతో పాటు సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో కరాటే మాస్టర్ జనార్దన్, హెచ్ఎం సుమంత్, ఎస్ఎంసీ చైర్మన్ వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

కలాం అవార్డు ప్రదానం

పూడూరు: మహనీయుల అడుగుజాడల్లో నడుస్తూ వారి ఆలోచన విధానాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లి సమసమాజ నిర్మాణంలో పాలుపంచుకుంటున్న మండల పరిధిలోని మంచన్‌పల్లికి చెందిన మహమ్మద్ రఫి ఏపీజే అబ్దుల్ కలాం అవార్డు అందుకున్నారు.



రహదారికి ఇరువైపులా ఉన్న చెట్లను జేసీబీతో తొలగిస్తున్న సిబ్బంది



జేసీబీతో రోడ్డుకు ఇరువైపులా చదును చేస్తూ..

జాతీయ రహదారి పనులు షురూ..

- రోడ్డుకు ఇరువైపులా చెట్ల తొలగింపు
- విడతల వారీగా రోడ్డు విస్తరణ
- రూ.630 కోట్లు మంజూరు

కొడంగల్: మహబూబ్‌నగర్ – చించోలి జాతీయ రహదారి నిర్మాణం పనులు ప్రారంభమయ్యాయి. రోడ్డుకు ఇరువైపులా ఉన్న చెట్లను తొలగిస్తున్నారు. విడతల వారీగా పనులు చేపట్టనున్నారు. జాతీయ రహదారి నిర్మాణం కోసం కాంట్రాక్టు పొందిన ఎస్ఆర్ఆర్‌సీ కంపెనీ బిట్ల వారీగా పనులను విభజించి ఇతరులకు అప్పగించారు. నిర్దేశిత సమయంలోపు పనులు పూర్తి చేయడానికి ప్రయత్నాలు జరుగుతున్నట్లు తెలుస్తోంది. రహదారి పొడవునా రోడ్డు విస్తరణ చేస్తున్నారు.

రూ. 630 కోట్ల వ్యయం

అంతర్రాష్ట్ర రహదారిని జాతీయ రహదారిగా మార్చడానికి కేంద్ర ప్రభుత్వం రూ.630 కోట్లు మంజూరు చేసింది. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రం నుంచి కర్నాటక రాష్ట్రం చించోలి వరకు జాతీయ రహదారి నిర్మిస్తారు. ఈ రహదారికి 167ఎన్ గా నామకరణం చేశారు. మహబూబ్‌నగర్, కోస్గి, కొడంగల్, తాండూరు మీదుగా చించోలి, మన్నాకెళ్లి వరకు రోడ్డు విస్తరణ జరుగుతుంది. నాలుగు లేన్లుగా రహదారి నిర్మిస్తారు. బెంగళూరు, ముంబయి జాతీయ రహదారులను కలిపే ఈ లింక్ హైవే 150 కిలోమీటర్ల పొడవు ఉంది. జిల్లాలో 45 కిలోమీటర్ల దూరం విస్తరించి ఉంటుంది.

రెండు చోట్ల బైపాస్ రోడ్లు

మహబూబ్‌నగర్ – చించోలీ జాతీయ రహదారిపై రెండు చోట్ల ఫ్లై ఓవర్లు నిర్మించడానికి ఆర్అండ్‌బీ అధికారులు సిద్ధమయ్యారు. డీపీఆర్‌లో సూచించిన అలైన్‌మెంట్ ప్రకారం కొడంగల్, తాండూరు పట్టణాల్లో బైపాస్ రోడ్లు నిర్మిస్తారు. కొడంగల్‌లో నాలుగు కిలోమీటర్ల దూరం, తాండూరులో 9 కిలో మీటర్ల దూరం బైపాస్ నిర్మిస్తారు. బైపాస్ రోడ్డు వెడల్పు 45 మీటర్లు ఉంటుంది. భూ సేకరణ కోసం రూ.150 కోట్లు కేటాయించారు.

కొడంగల్‌లో ఫ్లై ఓవర్

కొడంగల్‌లో నిర్మించే బైపాస్ మరో జాతీయ రహదారి అయిన బీజాపూర్ – హైదరాబాద్ జాతీయ రహదారిని క్రాస్ చేయాల్సి ఉంటుంది. ఈ రెండు జాతీయ రహదారులు కలిసే చోట రాకపోకలకు ఇబ్బంది ఉండకూడదనే ఉద్దేశంతో జాతీయ ఉపరితల రహదారుల శాఖాధికారులు ఫ్లై ఓవర్ నిర్మించాలని నిర్ణయించారు. ఫ్లై ఓవర్ నిర్మించే ప్రాంతంలో 150 ఫీట్ల రోడ్డు నిర్మిస్తారు. ఫ్లై ఓవర్‌తో పాటు ఇరువైపులా సర్వీస్ రోడ్లు నిర్మిస్తారు. ఫ్లై ఓవర్ నిర్మాణం హైదరాబాద్ బీజాపూర్ జాతీయ రహదారి పైనుంచి వెళ్తుంది. ఇరువైపులా సర్వీస్ రోడ్లు వేస్తారు.

పారిశుద్ధ్యంపై దృష్టి సారించండి

జిల్లా పంచాయతీరాజ్ శాఖ అధికారి శంకర్‌నాయక్



అన్నారం గ్రామంలో నర్సరీని పరిశీలిస్తున్న డీఎల్‌పీఓ శంకర్‌నాయక్

కొడంగల్ రూరల్: పారిశుద్ధ్యం, తడి, పొడి చెత్త, నర్సరీలు, పల్లె ప్రకృతి వనాలపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా పంచాయతీరాజ్ శాఖ (డీఎల్‌పీఓ) అధికారి శంకర్‌నాయక్ సూచించారు. బుధవారం మండలంలోని చిట్లపల్లి, అన్నారం తదితర గ్రామాల్లో పర్యటిస్తూ ఆకస్మిక తనిఖీలు చేశారు. గ్రామాల్లో ఇంటి పన్ను వసూలుకు చర్యలు తీసుకోవాలన్నారు. హరితహారం కార్యక్రమంలో భాగంగా నర్సరీలలో మొక్కల పెంపకంపై ప్రత్యేక శ్రద్ధచూపాలని సూచించారు. ఆయా గ్రామాల్లో అంగన్‌వాడీ కేంద్రాలను పరిశీలిస్తూ సలహాలు సూచనలు అందించారు. అనంతరం అన్నారం గ్రామంలో ప్రారంభమైన కంటివెలుగు కార్యక్రమాన్ని పరిశీలించారు. కంటి వెలుగు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకుంటూ పరిసరవాసులకు, వృద్ధులకు చేయూతనందించాలన్నారు. గ్రామంలో 170మందికి పరీక్షలు నిర్వహించగా 17మందికి కంటి అద్దాలను అందించారు. మరో 37మందికి కంటి అద్దాలను అందిస్తామని, 36 మందిని సర్జరీకి పంపిస్తున్నట్లు డాక్టర్ మహేందర్ రాజ్ తెలిపారు. కార్యక్రమంలో అన్నారం సర్పంచ్ అనిత, ఎంపీడీఓ పాండు, ఎంపీఓ శ్రీనివాస్, ఆయా గ్రామాల పంచాయతీ సిబ్బంది, అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

నెలాఖరులోగా సీసీరోడ్లు పూర్తి చేయండి



టెలికాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న రాహుల్ శర్మ

వికారాబాద్ అర్బన్: ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో గ్రామాల్లో చేపట్టిన సీసీ రోడ్ల పనులను ఈ నెలాఖరులోగా పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ రాహుల్ శర్మ సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో పంచాయతీరాజ్ ఈఈ శ్రీనివాస్ రెడ్డితో కలిసి టెలికాన్ఫరెన్స్ ద్వారా సీసీ రోడ్ల నిర్మాణ పనులపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంజూరైన సీసీ రోడ్ల పనులను వేగవంతం చేయాలన్నారు. చేపట్టిన పనులకు సంబంధించి చెల్లింపుల కోసం ఈ నెల 20లోగా ఎఫ్‌టీఓ ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు.

సస్యరక్షణ చర్యలు తప్పనిసరి

కేరెల్లిలో పంటలను పరిశీలించిన డీఏఓ గోపాల్



కేరెల్లి గ్రామంలో జొన్న పంటను పరిశీలిస్తున్న డీఏఓ గోపాల్

ధారూరు: కేరెల్లి గ్రామంలో బుధవారం జిల్లా వ్యవసాయ అధికారి గోపాల్, మండల వ్యవసాయ అధికారి జ్యోతి, వ్యవసాయ విస్తరణ అధికారి సంజూరాథోడ్‌లతో కలిసి వివిధ పంటలను పరిశీలించారు. ముందుగా వెంకటయ్యచారి రైతు పొలంలో సాగుచేసిన జొన్న పంటను పరిశీలించిన ఆయన కత్తెర పురుగు ఆశించడాన్ని గమనించారు. నివారణకు వెంటనే సస్యరక్షణ చర్యలు చేపట్టాలని రైతుకు సూచించారు. మోతాదుకు మించి రసాయన ఎరువులు, క్రిమిసంహారక మందులను వాడరాదని అన్నారు. సేంద్రియ ఎరువులను వాడాలని తెలిపారు. కొత్తిమీర, పుదీన పంటలు సాగు చేస్తే రోజూ ఆదాయం వస్తుందని, శ్రమ అనుకోకుండా పనిచేస్తే ఫలితం ఉంటుందన్నారు. వ్యవసాయ అధికారుల సలహాలు, సూచనలు తప్పక పాటించాలని రైతులకు తెలిపారు. కార్యక్రమంలో కేరెల్లి రైతుబంధు కోఆర్డినేటర్ రాంచంద్రారెడ్డి, రైతులు పాల్గొన్నారు.

పులుమద్దిలో ఐఆర్డీ శిక్షణ బృందం



పులుమద్దిలో ప్రకృతి వనాన్ని పరిశీలిస్తున్న బృందం సభ్యులు

అనంతగిరి: వికారాబాద్ మండలం పులుమద్ది గ్రామాన్ని బుధవారం రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శిక్షణ సంస్థ నుంచి శిక్షణ తీసుకుంటున్న 40 మంది పంచాయతీ కార్యదర్శుల బృందం సందర్శించింది. నాలుగు బృందాలుగా ఏర్పడి గ్రామస్తులతో, ప్రజాప్రతినిధులతో వివిధ శాఖల అధికారులతో గ్రామంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో పల్లె ప్రకృతి వనం కంపోస్టు షెడ్డు, నర్సరీ, ఎవెన్యూ ప్లాంటేషన్, ప్రకృతివనం నిర్వహణ బాగున్నాయని కితాబు ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ చంద్రకళ, సర్పంచ్ మాధవరెడ్డి, ఎంపీడీఓ సత్తయ్య, ఎంపీఓ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

వాహనదారులు నిబంధనలు పాటించాలి



షాపూర్‌లో నిర్వహించిన పోలీస్ పరేడ్‌లో పాల్గొన్న డీఎస్పీ సత్యనారాయణ

మర్పల్లి: వాహనదారులు రోడ్డు నిబంధనలు తప్పక పాటించాలని డీఎస్పీ సత్యనారాయణ అన్నారు. బుధవారం మండల పరిధిలోని షాపూర్‌లో కార్డెన్ సర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువాహనాలకు సంబంధించిన డాక్యుమెంట్లు పరిశీలించారు. సక్రమంగాలేనివాటిని స్వాధీనం చేసుకుని కేసులు నమోదు చేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ సత్యనారాయణ మాట్లాడుతూ వాహనాలకు సంబంధించి డాక్యుమెంట్లు సరిగ్గా లేకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. గ్రామంలో సుమారు 300 ఇళ్లు ఉండగా, అందులో వాహనం ఉన్న ప్రతి ఇంటిని తనిఖీ చేశారు. ఆరు ద్విచక్రవాహనాలు, ఆటో, కారుకు సంబంధించిన డాక్యుమెంట్లు సరిగ్గా లేకపోవడంతో కేసులు నమోదు చేసినట్లు ఎస్ఐ అరుణ్‌కుమార్‌గౌడ్ తెలిపారు. కార్యక్రమంలో మోమిన్‌పేట్ సీఐ వెంకటేశం, మర్పల్లి పోలీసులు ఉన్నారు.

ప్రజా సంక్షేమాన్ని విస్మరించిన ప్రభుత్వాలు

ఏఐసీసీ కోఆప్టెడ్ సభ్యుడు రమేశ్ మహరాజ్



తాండూరులో ప్రజలతో మాట్లాడుతున్న రమేశ్ మహరాజ్, నాయకులు

తాండూరు: ప్రజా సంక్షేమాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విస్మరించాయని ఏఐసీసీ కోఆప్టెడ్ సభ్యుడు, నియోజకవర్గ ఇన్‌చార్జి రమేశ్ మహరాజ్ అన్నారు. బుధవారం మున్సిపల్ పరిధిలోని హాథ్‌సే హాథ్ జోడో కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో దొరల పాలన కొనసాగుతోందన్నారు. తొమ్మిదేళ్ల క్రితం గ్యాస్ సిలిండర్ ధర రూ.450 ఉంటే బీజేపీ నేతలు గగ్గోలు పెట్టారని, నేడు అదే బీజేపీ రూ.1,200 పెంచిందన్నారు. ప్రజలకు మేలు జరగాలంటే కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఒక్కటే మార్గమన్నారు. కాంగ్రెస్‌తోనే అన్ని వర్గాలకు మేలు జరుగుతుందన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రూ.400కే గ్యాస్ సిలిండర్ అందజేస్తామన్నారు. కార్యక్రమంలో పీసీసీ ప్రధాన కార్యదర్శి ధారాసింగ్, పట్టణ అధ్యక్షులు ప్రభాకర్‌గౌడ్, మున్సిపల్ కౌన్సిలర్ తదితరులున్నారు.

బీఆర్‌ఎస్‌కు గుణపాఠం తప్పదు

బీజేపీ జిల్లా అధ్యక్షుడు సదానంద రెడ్డి



ఇంటింటికీ బీజేపీ కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు

తాండూరు టౌన్: వచ్చే ఎన్నికల్లో కేసీఆర్ సర్కార్‌కు ప్రజలు గుణపాఠం చెప్పడం తథ్యమని బీజేపీ జిల్లా అధ్యక్షుడు సదానంద రెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలో చేపట్టిన ఇంటింటికీ బీజేపీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను తామే అమలు చేస్తున్నట్లు కేసీఆర్ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం కేవలం ఖజానా ఖాళీ చేసే పనిలో ఉన్నదని ఆరోపించారు. జిల్లాకు మెడికల్ కళాశాల అందించిన ఘనత బీజేపీదేనని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మురళీకృష్ణ గౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్ కుమార్, పట్టణాధ్యక్షులు సుదర్శన్ గౌడ్, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

దామగుండం దర్శిద్దాం రండి



ఆలయ ఆవరణలో పుష్కరిణి



ఆలయంలో కొలువుదీరిన రామలింగేశ్వరుడు

- నేటి నుంచే రామలింగేశ్వర స్వామి ఉత్సవాలు
- భక్తుల కొంగుబంగారంగా విరాజిల్లుతున్న ఆలయం
- ప్రకృతి రమణీయతకు ఆలవాలం

పూడూరు: జిల్లాలో ప్రసిద్ధిగాంచిన దామగుండ రామలింగేశ్వర స్వామి ఉత్సవాలు గురువారం నుంచి ప్రారంభమవుతాయి. దామగుండం ఆలయాన్ని దర్శిస్తే సకల శుభాలు కలగడమే కాకుండా ఇక్కడి పుష్కరిణిలో స్నానమాచరిస్తే యమగండం తప్పుతుందని భక్తులు విశ్వసిస్తారు. చుట్టూ కొండలు పచ్చని చెట్ల మధ్య ప్రకృతి రమణీయతతో ఉట్టిపడే ఆహ్లాదకరమైన వాతావరణంలో రామలింగేశ్వరుడు కొలువుదీరాడు. స్వామివారిని దర్శించుకునేందుకు పరిసర ప్రాంతాల భక్తులే కాక, కర్ణాటక, మహారాష్ట్ర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో ప్రజలు తరలివస్తారు. ఆలయం 5 వందల యేళ్ల చరిత్రగలదని చరిత్రకారులు చెబుతున్నారు.

చేరుకోవడం ఇలా..

దామగుండ పుణ్యక్షేత్రం హైదరాబాద్ –బీజాపూర్ ప్రధాన రోడ్డుపై నుంచి మూడు కిలోమీటర్ల దూరంలో ఉంటుంది. వికారాబాద్ నుంచి వెంకటాపూర్ తండా, గుడుపల్లి మీదుగా దామగుండ పుణ్యక్షేత్రానికి రోడ్డు సౌకర్యం ఉంది. ప్రైవేటు వాహనాలు సైతం తిరుగుతాయి.

ప్రత్యేక కార్యక్రమాలు

రామలింగేశ్వర స్వామి ఉత్సవాలు గురువారం నుంచి జరుగుతున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ చంద్రశేఖర్ తెలిపారు. అఖండ దీపారాధన, ధ్వజారోహనంతో ఉత్సవాలు ప్రారంభమవుతాయన్నారు. 17న అగ్నిగుండం, రుద్రాభిషేకం, పార్వతి రామలింగేశ్వరుల కల్యాణం, రాత్రి 10 గంటలకు రథోత్సవం నిర్వహిస్తారని ఆయన తెలిపారు. 18న సహస్రబిల్వార్చన, రాత్రి దీపోత్సవం, 19న రుద్రాభిషేకం, సహస్ర పుష్పార్చన, 20న రుద్రాభిషేకం, చక్రతీర్థంతో కార్యక్రమాలు ముగుస్తాయని చైర్మన్ వివరించారు.

టవేరాను ఢీకొన్న లారీ

- ఒకరు మృతి
- ఇద్దరికి తీవ్రగాయాలు

పరిగి: ఎదురుగా వస్తున్న టవేరాను లారీ ఢీకొనడంతో ఒకరు మృతి చెందగా ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన మండల పరిధిలోని చింతల్ చెరువు సమీపంలో బుధవారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. యలాల మండలం పగిడ్యాల్‌కు చెందిన లాలప్ప, యాదయ్యలు చేవెళ్ల మండలంలో దినసరి కూలీలుగా పనిచేస్తున్నారు. నాగరగూడకు చెందిన హనీఫ్(40) టవేరాను మంగళవారం రాత్రి కిరాయి తీసుకుని వచ్చారు. లాలప్ప, యాదయ్య టవేరాలో ఉదయం బయలుదేరారు. రంగంపల్లి సమీపంలోకి రాగానే ఎదురుగా వస్తున్న లారీ ఢీకొంది. డ్రైవర్ హనీఫ్ కారులోనే ఇరుక్కొని అక్కడికక్కడే మృతి చెందాడు. లాలప్ప, యాదయ్యలకు తీవ్రగాయాలు కాగా చికిత్స నిమిత్తం నగరానికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

సీసీఐ కాంట్రాక్టర్‌పై పోలీసులకు ఫిర్యాదు

తాండూరు రూరల్: కరన్‌కోట్ శివారులో ఉన్న సిమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(సీసీఐ) కాంట్రాక్టర్‌పై కార్మికులు బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. తమను అకారణంగా విధుల్లోంచి తొలగించడంతో పాటు నాలుగు నెలల నుంచి జీతాలు ఇవ్వలేదన్నారు. బుధవారం కార్మికులు ఎస్ఐకి రాతపూర్వకంగా ఫిర్యాదు చేశారు. వెంటనే తీసుకోవాలని కార్మిక సంఘం నాయకులు కోరారు.

కంటి వెలుగుతో అంధత్వ నివారణ: ఎమ్మెల్యే

నవాబుపేట: అంధత్వ నివారణకే కంటి వెలుగు కార్యక్రమం చేపడుతున్నట్లు ఎమ్మెల్యే కాలె యాదయ్య తెలిపారు. చించల్‌పేటలో బుధవారం కంటి వెలుగు కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ కంటి పరీక్షలు చేయించుకోవాలన్నారు.

సద్వినియోగం చేసుకోండి

ధారూరు: జిల్లా వైద్యాధికారి పల్వన్‌కుమార్ బుధవారం ధర్మాపూర్‌లో కొనసాగుతున్న కంటి వెలుగు కార్యక్రమాన్ని డాక్టర్ అరవింద్, డాక్టర్ జీవరాజ్‌లతో పరిశీలించారు. కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. అవసరమైన వారికి కళ్ల అద్దాలు ఇవ్వాలన్నారు.

నిందితులను కఠినంగా శిక్షించాల్సిందే



వికారాబాద్ పట్టణంలో నిరుద్యోగ అభ్యర్థుల నిరసన

అనంతగిరి: టీఎస్‌పీఎస్సీలో పేపర్ లీకేజీకి పాల్పడిన వ్యక్తులను కఠినంగా శిక్షించాలని నిరుద్యోగులు డిమాండ్ చేశారు. బుధవారం వికారాబాద్ పట్టణంలో పోటీ పరీక్షలకు సన్నద్ధం అవుతున్న అభ్యర్థులు నిరసన చేపట్టారు. ఎన్టీఆర్ చౌరస్తాలో ప్లకార్డులతో నిరసన తెలిపి అదనపు కలెక్టర్ రాహుల్ శర్మకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టీఎస్‌పీఎస్సీ నిర్వాకం వల్ల కష్టపడి చదువుకుంటున్న నిరుపేద నిరుద్యోగులకు తీవ్ర అన్యాయం జరుగుతోందన్నారు. ఇలాంటి ఘటనలు మరోసారి పునరావృతం కాకుండా సిట్టింగ్ జడ్జితో న్యాయ విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు.

రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యం

- మద్యం తాగి వాహనాలు నడిపితే చర్యలు
- డీఎస్పీ శేఖర్‌గౌడ్

యాలాల: రోడ్డు ప్రమాదాల నివారణకు పోలీసు శాఖ ప్రత్యేక చర్యలు చేపడుతున్నదని డీఎస్పీ శేఖర్‌గౌడ్ అన్నారు. మంగళవారం రాత్రి మండల పరిధిలోని కమాల్‌పూర్‌లో పోలీసుల ఆధ్వర్యంలో కళాజాత నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ.. నియోజకవర్గ పరిధిలో ప్రతి ఏడాది సుమారు 30 మంది మృత్యువాత పడుతున్నట్లు గుర్తించామన్నారు. ఇందుకు ప్రధాన కారణం మద్యం తాగి వాహనాలు నడపడమేనని అన్నారు. వాహనాలు నడిపే ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించాలని సూచించారు. అత్యవసర సమయాల్లో డయల్ 100కు ఫోన్ చేసి సహాయం పొందాలన్నారు. సైబర్ నేరాల పట్ల యువత అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ వెంకట్‌రెడ్డి, ఉపసర్పంచ్ రాంచందర్, నాయకులు బిచ్చప్ప, బోనప్ప, భాస్కర్, నర్సింహ నరేష్ తదితరులు ఉన్నారు.

మెరుగైన వైద్య సేవలు అందించాలి



ఆస్పత్రిలో విభాగాలను పరిశీలిస్తున్న కాయకల్ప బృందం

కొడంగల్: స్థానిక ప్రభుత్వ సివిల్ ఆస్పత్రిని కాయకల్ప ప్రోగ్రామ్ ప్రతినిధి బృందం బుధవారం తనిఖీ చేసింది. డాక్టర్ నారాయణరెడ్డి ఆధ్వర్యంలో టీమ్ సభ్యులు సందర్శించి అన్ని విభాగాలను పరిశీలించారు. వైద్య పరికరాలు వాడే విధానం గురించి వివరించారు. ముఖ్యంగా రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించారన్నారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ మూర్తి మాట్లాడుతూ ఆసుపత్రి కాయకల్ప పథకం కింద ఎంపిక కోసం వైద్య బృందం పరిశీలించిందన్నారు. తుది దశ విచారణలో భాగంగా కొడంగల్‌కు వచ్చినట్లు తెలిపారు. కాయకల్ప పథకానికి ఎంపికైతే మొదటి బహుమతి కింద రూ.15 లక్షలు, రెండో బహుమతి కింద రూ.10 లక్షలు వస్తాయని చెప్పారు. రోగులకు మెరుగైన సేవలు అందించడానికి కృషి చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో డాక్టర్లు వీణ, సాకేత్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.